

# ఆమెయెలావుందో!

శ్రీ యం. యస్. నరశింహారావు.

రాత్రి ఎనిమిది గంటలవుతుంది. నేనప్పుడే భోజనంచేసి, నా గదిలో "పడకకుర్చీ"లో కూర్చుని 'చిత్రగుప్త' పేజీలు యిటూఅటూ తిరగవేస్తున్నాను, "ప్రేమలేఖలు" అనే శీర్షిక అగుబడింది. అది "చలం" గారు వ్రాసింది, ఆలేఖలేమిటో చదువుదామని రెండు మూడు వాక్యాలు చదివానో లేదో నా పక్కగదినుంచి అరపులు వినిపించాయ్.

పుస్తకం మూసి, ప్రక్కనున్న బల్లమీద వుంచి, "ఆ అరపు యెవరిదో? పాపం! ఏం కష్టమొచ్చిందో!" అని ఆలోచిస్తూ వుండగా, తాడనశబ్దాలుకూడా వినబడ్డాయి. నాకింక అక్కడ వుండబట్టక, దీపం తగ్గించి, తలుపువేసుకుని బయటి వచ్చాను.

నిరంజనుని గదిముందర ఇరుగుపొరుగువారంతా గుమిగూడి వింతగా చూస్తున్నారు. నేనుకూడా ఆ గుంపులో చేరాను. అది ఏమివింతో అని చూస్తే, నిరంజనుడు కాలరుద్రుడులా కండ్లెఱ్ఱచేసి, తన భార్య కమల నుద్దేశించి,

"శనిగొట్టు ముండా. నాకెక్కడ దాపరించావే! పొద్దల్లా చెమటోడ్చి, కష్టపడి ఇంటికివచ్చి ఆనందంగా, కాలం గడుపుదామనుకుంటే, యింటాబయటాకూడా శాంతి లేకుండా చేస్తున్నావే!! ఇవ్వాళ నువ్వో' నేనో...."

అని పాపమా యిల్లాలిని ఊపిరి తిరగకుండా కొడుతున్నాడు. ప్రక్కనుండి నిరంజనుని తల్లి, "ఒరే నాయనా ఇంకచాల్లేరా! ఇరుగు పొరుగు వాళ్ళంతా వచ్చారు. దాన్నెవరూ ఏమనరురా! అనవసరంగా నువ్వే రొష్టుపడిపోతావు. భోజనం చేద్దుగాని రా నాయనా!" అని అంటూంది.

తల్లిమాట వినిపించుకోకుండా తనపని తాను చేస్తున్నాడు, అక్కడ మూగిన జనమంతా వినోదంగా చూస్తున్నారు.

నేనా దృశ్యం చూసి సహించలేకపోయాను. నిరంజనుని వారించడానికి అక్కడెవడికీ సాహసం లేకపోయింది. నేనక్కడ వారికి, అపరిచితుడ నైనప్పటికీ, చొరవ చేసుకుని, నిరంజనుని చేయి పట్టుకుని, "ఏమిటయ్యా ఈ దౌర్జన్యం! స్త్రీమీదనయ్యా నీ ప్రతాపమంతా చూపేది! ఆడుదానిని యిల్లా హింసించడానికి సిగ్గులేదూ? నీ భార్యమీద నీకెంత అధికారమున్నా ఇల్లాకొట్టి చంపుతావయ్యా! చాలుచాల్లే ప్రయోజకత్వం! ఇంకోసారి మాయెదుట ఆమె ఒంటిమీద చెయ్యివేశావా, చూడు నీ సంగతి, ఏమవుతుందో!" అని అదలించాను. నాకు తిరుగా నిరంజనుడు జవాబివ్వబోతూంటే. అక్కడ వున్నవారంతా, నా పక్షంగా ఒక్కసారి నిరంజనుని నిందించ నారంభించారు.

కమల ఇదే అదను చూసుకుని, లోపలకి వెళ్ళిపోయింది. నేనూ బయటకు రాగానే నిరంజనుడు లోపలకువెళ్ళి తలుపు బిగించేశాడు.

ప్రేక్షకులు నా సాహసాన్ని ప్రశంసిస్తూ వారివారి ఇండ్లకు వెళ్ళిపోయారు. నేను నా గదిలోకి వెళ్ళి ప్రక్కమీద వ్రాలాను.

* * *

## ౨

నేనీవూరు ఉద్యోగరీత్యా వచ్చి కొద్ది రోజులు మాత్రమే అయినందువల్ల నాకిక్కడ పరిచితు లెవ్వరూ లేరు. నా మానాన్ని ఆఫీసుకుపోయి, ఎవరి జోక్యమూ లేకుండా తిర్గిగి బస చేరుకుంటూఉండే వాడిని. ఒకవేళ ఎవరైనా తెలుసుకుందామని వచ్చినా, అవకాశ మిచ్చేవాణ్ణి గాదు. అందుచేత ఎవరికి తోచిన విధాన్ని వారనుకునే వారు నా గురించి.

"రమేశుడు, వట్టి అమాయకుడు. ప్రపంచానికి తనకీ ఏమీ సంబంధం లేకుండా ఉంటాడు" అని కొందరు:

"ఆ: అల్లా గనడానికి వీల్లేదు. పైకిలా కనిపించేవాళ్ళే కాళ్ళకింద గోతులు తీసేవాళ్ళు" అని కొందరు. ఇంకా ఏమేమో అనుకుంటూ వుండేవారు. నేనివన్నీ పాటించలేదు. వాస్తవానికి నాకీ ప్రపంచంలో 'నా' అన్నవాళ్ళెవరూ లేరు.ఏకాకిని.ఆస్తిపాస్తులు అగ్గిపాలయాయి. వివాహంలేదు. జీవితం హేయమనిపించింది గాని జీవితమున్నన్నాళ్ళు ఏదో విధంగా కాలం వెళ్ళబుచ్చాలని ప్రయత్నం చేసి, ఒక చిన్న గుమస్తాపని సంపాదించి యీగ్రామం వచ్చాను.

ఆరాత్రంతా, నాకు నిద్దర పట్టలేదు. కళ్లు తెరిస్తే కమలానిరంజనుల దృశ్యం ప్రత్యక్షమయ్యేది. ఏదో విధంగా ఆ రాత్రి వెళ్ళబుచ్చాను.

మరునాడు ఆదివారం. ఆఫీసుకు శలవు. నేనారోజున ఎక్కడికీ కదల్లేదు.

గతరాత్రి నిరంజనుడు అంత పైశాచికంగా ఎందుకు ప్రవర్తించాడో కనిపెట్టాను.

కమల స్ఫురద్రూపి. నవనాగరికత కలది. సూర్యోదయం కాకముందే లేచేది. ఏలోటుపాటూ లేకుండా ఇంటిపనంతా చేసేది. సమయమున్నప్పుడల్లా, కుట్టుపనో, చదువుకోవడమో చేస్తూవుండేది. ఇంటి పనుల్లో లోపం లేకపోయినా, ఒక మూల నుంచి వేధిస్తూ వుండేది అత్తగారు. ఆతల్లి చచ్చి ఎక్కడుందో, వాడికి అడుగులకు మడుగులొత్తుతూ వుండేది. బుద్ధి గడ్డితిని, నిన్ను కట్టబెట్టాను. ఎప్పుడూ నీపనే గాని, వాడి ఖాతరేలేదు రోజుకు రోజు దిగనారి పోతున్నాడు. వాడు నీ మూలాన్ని" అని యింకేమోమో సూటిపోటీ మాటలచేత కమల మనసు నొప్పించేది. సాయంత్రం నిరంజనుడు యింటికి రావడంతోనే కోడలిమీద లేనిపోని చాడీలు చెప్తూండేది.

నిరంజనుడికి వివేచనాజ్ఞానమున్నట్టు కనబడదు. భార్య అంటే, ఒక బానిస అనీ వివాహంవల్ల ఆడుదానిమీద సర్వాధికారం వస్తుందని భావిస్తాడు.

అనుకోవచ్చు. అతడు కమలయెడచూపే అనాదరణకు....

* * *

## ౩

సాయంత్రం 5 గంటలవుతుంది. ఆఫీసు వదిలి నాగదికి వచ్చాను. గదితాళము లేకుండా, బయట గడియమాత్రం వేసివుంది. నాకాశ్చర్యం వేసింది. తాళంవేయడం మరచిటినేమో అనుకుని తలుపు తెరచి చూస్తిని గదా, నా కండ్లను నేను నమ్మలేదు. నాగది నూతన కళలతో ఒప్పారుతోంది. అదివరకు చిందరవందరగా గదిఅంతా నిండియున్న వస్తువులు వాటి నియమితస్థలాల్లో చక్కగా అమరివున్నాయి. ధూళిదూసరితమైయున్న నాగది అతి శుభ్రంగా వుండి మనసుకుఆనందం కలుగచేస్తూంది. దీనికంతకూ కారకులెవరయి వుంటారని ఆలోచిస్తూ ప్రక్కతిరిగి చూచేసరికి కమల తలవంచుకుని, గది గుమ్మందగ్గఱ నిల్చుంది. "ఈవేళ మీరు గదికి తాళంవెయ్యడంమరచిపోయారు" అని తాళం అందిచ్చింది.

"ఆఁ! మరచి వుంటాను. నాగదికి జీవకళ తెచ్చింది మీరే అని తలుస్తాను! అనవసరంగా మీకు శ్రమకల్గించినవాడినయాను."

"నాకేమీ శ్రమనిపించలేదు. నేను యిలా చొరవచేసుకుని గది సర్దినందుకు నన్ను క్షమించాలి."

"ఎంతమాట! నా కృతజ్ఞతా పూర్వక వందనాలు!"

"ఆయన మీమీద చాలా కోపంగా వున్నారు!"

"నిరంజనుడా! ఏం అన్నాడు? నేను మీ విషయంలో కల్పించుకొన్నందుకా?

"అంతే!"

"అకారణంగా ఒకస్త్రీమీద చూపుతూన్న పశుబలాన్నీ వారించడంలో నేనేమీ తప్పు చేశాను?"

ఇంతలో ఎవరో మేడమెట్లు ఎక్కుతూన్న చప్పుడు వినబడింది. కమల అత్తగారు వస్తూందని భయపడి, తన గదిలోకి మెరుపుమెరసినట్లు వెళ్ళిపోయింది, నేను గదిగుమ్మందగ్గఱ నిల్చున్నాను. నిరంజనుని తల్లి నావైపు 'కొరకొర' చూస్తూ, 'చరచర' వెళ్ళిపోయింది.

'నేనేం చేశానని నామీద ఆమెకంత కోపం?" అని అనుకుంటూ నేను తలుపు వేసుకు బయటకు వెళ్ళిపోయాను.

* * *

వెన్ను వాల్చాను గాని నిద్రపట్టలేదు. దీపం పెద్దదిచేసి కొంతసేపు చదువుకుందామని "చంద్రగుప్త" హిందీ నవల తీశాను. కాని చదువుసాగలేదు. నాటిసాయంకాలపు దృశ్యం కనులఎదుట పరిభ్రమిస్తూవుంది.

"పాపం: అమాయకురాలు! కమల ఏంచేయగలదు! అత్తగారూ, భర్త ఎన్ని బాధలు పెట్టినా, సహించి వుండవలసిందేనా? మరి వారిని అతిక్రమించి ఎక్కడికి పోగలదు! ఒకవేళ సాహసించినా, సంఘం ఊరుకుంటుందా? "కాకుల్లాగ పొడిచి చంపెయ్యదూ?" భార్యాభర్తలకు సమాన హక్కులిచ్చిన సంఘానికి ఇద్దరియందు సమభావమెందుకు వుండకూడదో?" అని తర్కించుకుంటూ నిద్రపోయాను. ఎప్పుడో!

* * *

తెల్లవారుఝాము 4½ గంటలయింది. అప్పుడప్పుడే మెలకువవస్తోంది. ఇంకా

పక్కమీద పడుకునే బద్ధకం తీర్చుకుంటున్నా. నా గదితలుపు తట్టినట్లయింది. పోయి తలుపు తెరచాను. కమల విచార వదనముతో ఎదురైంది.

"ఏమమ్మా! అంత దీనంగా వున్నారు?"

"మేమంతా, వేరొకయింటికి వెళ్ళిపోతున్నాం. మీదర్శనభాగ్యం నాకు కరువైపోతుంది."

"ఇంత ఆకశ్మికంగా మారవలసిన అవసరం?"

"నేను చెప్పలేను. మీ రానాడు సాయంత్రం యిక్కడ నిల్చుండం మా అత్తగారికి అనుమానం కలిగించింది. అదీగాక మీరూ మా ప్రక్కనే వుండడంవల్ల, నాకష్టే బాధకలిగించగలిగే అవకాశం వారికి లేకుండా వుంది."

"అయ్యో! పాపం; నావల్ల మీకెంత ముప్పువచ్చింది. అనుమానం ఒక పిశాచం పడుతే మరి వదలదు. ఎంతపనైనా చేయిస్తుంది. అయితే ఎప్పుడు మారదానికి నిశ్చయించారు?"

"ఎల్లుండి."

అరుణోదయమవుతూంది. అత్తగారు చూస్తే ఏమంటుందా అని భయపడ్డది కమల.

"ఈ దీనురాలిని మరువకండి!"

అని అశ్రుపూరిత నయనాలతో వెళ్ళిపోయింది నా ముఖంచూస్తూ. ఆమెను చూస్తే నాకళ్ళలోగూడ నీళ్ళు తిరుగేయి.

* * *

ఆనాడు ఆకాశాన్ని కారుమబ్బులు అలుముకున్నాయి. తుపాను చిహ్నాలు కనబడుతున్నై. నా మనసులో కూడా ఓ చిన్న తుపాను చెలరేగినట్లగు పడుతూంది. గదిలో తలుపువేసుకుని ఆలోచిస్తున్నా. ఆలోచన సముద్రతరంగాల్లా లేస్తున్నాయి పడిపోతున్నాయి.

'భర్తకాగానే మొగవాడికి ఆడుదానిమీద యింత అధికారమొస్తుంది కాబోలు! వివాహంతోనే ఆడుదాని వ్యక్తిత్వం పోతుందేమో? కమలా నిరంజనుల దాంపత్యం చూస్తూంటే వివాహమనేది, ప్రేమబంధమో పాశబంధమో నాకు తెలియటం లేదు. హృదయ పూర్వకంగా ప్రేమించుకున్న స్త్రీ పురుషులకు వివాహము ప్రేమబంధము. ఆ బంధము ఒక్క జన్మకీ కాదు జన్మ జన్మాంతరములు శాశ్వతముగా వుండిపోతుంది. పరస్పరానురాగము లేనప్పుడు, ఈ వివాహమెందుకు? స్త్రీపురుషులను సంఘనియమాలచే బందీకృతల చేయడమెందుకు? అందులో సంఘనియమాలు ఆడుదానియెడ అతి దారుణంగా వుంటాయి. ఆడుదాని వ్యక్తిత్వము నశింపచేస్తుంది. బానిసకన్న కనిష్టం చేస్తుంది. దీనికి నిదర్శనం కమలే! ఎప్పటికైనా మారుతుందో లేదో!" అని ఆలోచిస్తూ ప్రక్కమీదకు జరిగాను.

* * *

మరునాడు ఉదయాన్నేలేచి, "నేను వారి పొరుగు నుండ బట్టేకదా కమలకు భరింపరాని బాధలు కలుగుతున్నాయి! నేను యిక్కడనుండి వెళ్ళిపోతేనైనా ఆమె కాష్టాలు తగ్గుతాయోమో!" అని నా సామానంతా హొటేల్‌కుమార్చేశాను. అక్కడ కొన్నాళ్ళుండేక. నాకావూరినుండి, కోరిన ప్రకారం బదిలీ అయింది. నేనా వూరు వదలివేసి వచ్చాను కానీ కమలను మరవలేకున్నాను.

'నేను అక్కడ లేకపోవడంవల్ల ఆమె కష్టాలుతగ్గి ఇప్పటికైనా ఆమె సుఖంగా వుందోలేదో!' అని అలాపనచేస్తూంటుంది నా అంతరాత్మ అప్పుడప్పుడు.

## శ్రావణ శుక్రవారం

ఒకరు:—

రేపు "మండే" (Monday) నాడు మీ స్కూలుకు సెలవటగా!

ఇంకొకరు:—స్కూలు "మండే"నాడు ఎల్లాగూ సెలవే!

* * *

గుమాస్తా:—ఏమండీ! రేపు చివరి శ్రావణ శుక్రవారం. ఇంట్లో ఆడవాళ్ళు నోము నోచుకుంటారుట. ప్రతిఏడూ చివరిశ్రావణశుక్రవారానికి సెలవిచ్చే మామూలుంది. యీఏడుకూడా........................

యజమాని:—నిరుడు సెలవిచ్చినట్లు లేదే?

గుమాస్తా:—ఆ! నిరుడు శ్రావణ శుక్రవారం ఆదివారంనాడు వచ్చింది. అంచేత సెలవియ్యాల్సిన అవసరమే లేకపోయింది.

—రాం. బక్కరాజు.